క్లుప్తంగా

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న సభ్యులు

ఓడీచెరువు : మండల కేంద్రంలో ఆదివారం ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించినట్లు జిల్లా కమిటీ వర్కింగ్ చీఫ్ ఎం.ఎస్. షబ్బీర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. సెక్రటరీగా మహబూబ్‌బాషా, ఆఫీస్ సెక్రటరీగా జయరాం నాయుడు, కార్యవర్గ సభ్యులుగా నాగముని, ఈశ్వరప్ప, కృష్ణమూర్తి, రామచంద్రను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఇటీవల యుద్ధంలో మరణించిన అమరవీరుడు మురళీనాయక్‌కు నివాళులర్పించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ కౌన్సిల్ మెంబర్‌గా షేక్షావలి



కదిరి అర్బన్: నేషనల్ హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా కౌన్సిల్ మెంబర్‌గా కదిరి పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ షేక్షావలి ఆదివారం నియమితులయ్యారు. దేశవ్యాప్తంగా మారుమూల ప్రాంతాల్లో క్రీడల్లో యువత రాణించేందుకు కృషి చేస్తున్న షేక్షావలి సేవలను గుర్తించి కౌన్సిల్ మెంబర్‌గా అవకాశం కల్పించారు. తన నియామకానికి సహకరించిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ, జాతీయ అధ్యక్షుడు భాస్కర్ నాయుడుకు షేక్షావలి కృతజ్ఞతలు తెలిపారు.

గుంటు ఓబులేసు స్వామి విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో ఓబులేసు స్వామి

రామగిరి: పేరూరు గ్రామంలోని కురుగుండ్ల కాలనీలో ఆదివారం గుంటు ఓబులేసు స్వామి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. శనివారం ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ట జరిగిన విషయం విదితమే. ఆదివారం ఉదయం ఆలయంలో వేద పండితులు గోరంట్ల నాగేంద్ర స్వామి, పేరూరు రామకృష్ణ స్వామి, రాజారాం స్వామి ఆధ్వర్యంలో గుంటు ఓటులేసు స్వామి ప్రాణ ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, పూర్ణాహుతి, గోపూజ తదితర పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుబ్రమణ్యం, శివ కుమార్, మురళి, రమేష్ బాబు, అశోక్ కుమార్, నరేంద్ర, ప్రసాద్, నరేష్, హరిష్, మల్లికార్జున, గోవర్దన్, రాము తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ ప్రారంభోత్సవం



అయ్యప్పస్వామి విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఆదివారం నవగ్రహ మండప ఆరాధనం, ప్రధాన కలశారాధనం, అగ్ని ప్రతిష్ట, మహా గణపతి, నవగ్రహ, దేవత, సుబ్రమణ్య, రుద్ర, సూక్త, ధర్మశాస్త్ర, మూలమంత్ర, గాయత్రి, దేవత హోమాలను వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ గురుస్వామి పీజే విజయ్‌కుమార్, అర్చకులు నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి భజన మందిరం నుంచి నూతన అయ్యప్పస్వామి దేవాలయం వరకూ అయ్యప్పస్వామి మూలమూర్తుల విగ్రహాలను పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

పుట్టపర్తిలో విస్తృత తనిఖీలు



తనిఖీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

పుట్టపర్తి టౌన్: దేశ సరిహద్దుల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో పుట్టపర్తి పట్టణంలో ఆదివారం డీఎస్పీ విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, హోటళ్లు, లాడ్జీలు, జనసంచార ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించారు. డీఎస్పీ మాట్లాడుతూ లాడ్జ్ పరిసర ప్రాంతాలు కనబడే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులను గుర్తించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేంద్రియ సాగు.. లాభాలు బాగు



చెరువు మట్టిని పంట పొలానికి ఎరువుగా వేసిన దృశ్యం

- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి
- సేంద్రియ ఎరువులకు పెరుగుతున్న డిమాండ్

నల్లమాడ: మారుతున్న కాలానికి అనుగుణంగా అన్నదాతల్లో కూడా పంట సాగు విధానంలో మార్పులు వస్తున్నాయి. సాంకేతికతను ఉపయోగించుకొని పెట్టుబడి ఖర్చులు తగ్గించుకొనే దిశగా ముందడుగేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది. ఖరీఫ్ పంటల సాగులో సేంద్రియ ఎరువులు వాడేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు.

రసాయనిక ఎరువులతో భారం

రసాయనిక ఎరువుల ధరలు మార్కెట్‌లో రోజురోజుకూ పెరుగుతున్నాయి. రసాయనిక ఎరువుల కొనుగోలుకు రైతులు అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి భారం పెరిగి అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. రసాయనిక ఎరువులు వాడకం వల్ల చీడపీడలు సోకి పంట దిగుబడి తగ్గిపోతోంది. వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలతో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు.

భూసారం పెంపు దిశగా..

రసాయనిక ఎరువుల ద్వారా కలుగుతున్న అనర్థాలపై రైతుల్లో చైతన్యం వచ్చింది. దీంతో భూసారాన్ని పెంపొందించుకొనే దిశగా రైతులు ముందుకెళ్తున్నారు. పశువుల పేడ, కుంటలు, చెరువుల్లో పేరుకుపోయిన రేగడి మట్టిని పొలాలకు తోలుతున్నారు. పాడి ఎరువుల కొనుగోలుకు సిద్ధమవుతున్నారు.



సేంద్రియ ఎరువులే మేలు

సేంద్రియ ఎరువుల వాడకంతో పంటల సాగులో ఖర్చు తక్కువ అవుతోంది. దిగుబడి కూడా లాభసాటిగా ఉంది. రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి గట్టిపడి సత్తువ కోల్పోతుంది. పంటకు రోగాలు కూడా ఎక్కువ వస్తాయి. పశువుల పేడ వాడకంతో భూమి గుల్ల బారి ఎక్కువ కాలం సత్తువ ఉంటోంది. రోగాలు తక్కువగా ఉండి అధిక పంట వస్తోంది. అందుకే ప్రతి ఏటా పశువుల ఎరువునే వాడతా. – రామకృష్ణారెడ్డి, పాతబత్తలపల్లి, నల్లమాడ మండలం



సేంద్రియంతో అనేక లాభాలు

సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా రైతులకు అనేక లాభాలు చేకూరతాయి. పశువుల పేడ, చెత్తతో కూడిన సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పంట పొలాల్లో ఎక్కువ కాలం భూమిలో తేమ ఉంటుంది. తేమ ఎక్కువగా వుండటం వల్ల చీడ పురుగులు నశిస్తాయి. తెగుళ్ల కూడా తక్కువే. రైతుకు తక్కువ ఖర్చు అధిక దిగుబడి లభిస్తుంది.

– శంకర్‌నాయక్, వ్యవసాయాధికారి, నల్లమాడ మండలం



ధర్మవరంలోని దుర్గమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

ఘనంగా దుర్గమ్మ పరుష



అలంకరణలో దుర్గమ్మ అమ్మవారు



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం ముగిసిన అనంతరం నిర్వహించే దుర్గమ్మ పరుష ఆదివారం ప్రారంభమైంది. దుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ ముందుభాగంలో ప్రధాన రహదారులపై వెలసిన దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. గాజుల దుకాణాలు, బొమ్మలు, ఇంటి సామాగ్రి, ఇంటి అలంకరణకు ఉపయోగపడే పూలు, ఇతరత్రా వస్తువుల కొనుగోలులో ప్రజలు గుమికూడారు. మూడురోజులపాటు జరిగే ఈ పరుషకు పట్టణం నుంచే కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

వైభవంగా పుష్కర కుంభాభిషేకం



యాగశాలలో పూజలు చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల చౌడేశ్వరి దేవి ఆలయంలో పుష్కర కుంభాభిషేకం పూజా కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాటిల్ ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాటిల్ కపిల్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గుడికట్టు దారులు కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి వెండి, బంగారు ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7.30 గంటలకు వేద పండితులు భగవత్ ప్రార్థన, సభా ప్రార్థన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, మహా కలశ ఆవాహన, ఆధారన, ద్వార తోరణం, ధ్వజ కుంభ ఆరాధన పూజ, చక్ర మండల ఆధారన, నైవేద్యం, మంగళ నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజలను నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొని అమ్మవారికి కొబ్బరి కాయలు సమర్పించి, పూజలు మొక్కులు తీర్చుకున్నారు.

సెమీ ఫైనల్‌కు అనంత, కదిరి జట్లు

అనంతపురం: సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు, చంద్రమోహన్ స్మారకార్థం నిర్వహిస్తున్న టోర్నీలో సెమీఫైనల్‌కు అనంతపురం రైజింగ్ స్టార్, కదిరి జట్లు చేరుకున్నాయి. తాడిపత్రి దినేష్ గ్రానైట్స్, అనంతపురం రైజింగ్ స్టార్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో దినేష్ గ్రానైట్స్ జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసింది. 17.1 ఓవర్ల వద్ద పది వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంత రైజింగ్ స్టార్ జట్టు 17 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి 114 పరుగులతో విజయాన్ని కైవసం చేసుకుంది.

- కదిరి, తాడిపత్రి ఎలెవన్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కదిరి జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టి 62 పరుగులు చేసింది. జట్టులో పి. గిరినాథ రెడ్డి 45 పరుగులు, వి.భాను ప్రకాష్ 30 పరుగులు, కె.ప్రశాంత్ 39 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తాడిపత్రి ఎలెవన్ జట్టు 131 పరుగుల వద్ద చతికిలపడింది. దీంతో అనంతపురం రైజింగ్ స్టార్, కదిరి జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. మాజీ రంజీ ఆటగాడు షాబుద్దీన్, ఏడీసీఏ అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, సెక్రటరీ వి. భీమలింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుడికి ఘన నివాళి



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న విలేకరులు

ఓడీచెరువు: పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన మురళీనాయక్‌కు ఓడీ చెరువు విలేకరులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు భుజంగం వసంతరావు, సాధిక్, విలేకరులు షాజహన్, ఫిరోజ్, బాబా, శ్రీనివాసులు, ఫయాజ్ పాల్గొన్నారు.

ఎన్పీకుంట: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగదీశ్వర రెడ్డి ఆధ్వర్యంలో వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. భారత్–పాకిస్తాన్ యుద్ధంలో వీర జవాన్ మృతి బాధకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రఘునాథ, శివశంకర్‌రెడ్డి, సర్దార్, వినయ్ పాల్గొన్నారు.

ఏటి గంగమ్మ సంబరాలు



కోటూరులో వెలసిన చింతమాను గంగమ్మ



పూలబుట్టలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

తలుపుల: ఎగువపేట సమీపంలోని ఏటి గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం మొలకల పౌర్ణమి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఉదయం టి.రెడ్డివారిపల్లి నుంచి మహిళలు పూల బుట్టలు ఎత్తుకొని తప్పెట్లతో ఊరేగింపు చేపట్టారు. ఈడిగ కులస్తులు బోనాలు, కల్లు ఘట్టంతో ఎగువపేట, కుమ్మరపేటల నుంచి ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం గొడుగులతో మెయిన్ రోడ్డు, బలిజపేట, ఓబీఆర్ రోడ్డు, ఎగువపేట మీదుగా తీసుకెళ్లి ఏటి గంగమ్మకు చీర, సారె సమర్పించారు. ఆమె చెల్లెలు అయిన చింతల గంగమ్మ, గాండ్లపెంట గంగమ్మకు చీర సారె సమర్పించి సంబరాలకు ఆహ్వానించారు. రాత్రికి ఉబ్బరవాండ్లపల్లి నుంచి చాందినీ బండి డీజేతో యువకుల కేరింతలతో ఊరేగింపుగా అమ్మవారి గుడి వద్దకు చేరుకుంది.

నేటి నుంచి చింతమాను గంగమ్మ ఉత్సవాలు

గాండ్లపెంట: మండల పరిధిలోని మలమీదపల్లి పంచాయతీ కోటూరులో మొలకల పౌర్ణమి పురస్కరించుకుని చింతమాను గంగమ్మ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రాత్రి జ్యోతుల ఉత్సవం, మంగళవారం రాత్రికి బండ్ల మెరవణి కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

ఎండల్లో హాయ్.. హాయ్



ట్యూబ్‌ల సహాయంతో ఈత కొడుతున్న పిల్లలు. (ఇన్‌సెట్‌లో) డైవ్ చేస్తున్న యువకుడు

ఎండల తీవ్రత పెరగడంతో చిన్నా పెద్దా తేడా లేకుండా ఈత కొట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారు. కొందరు బావులకు వెళ్తుండగా.. మరికొందరు స్విమ్మింగ్ పూల్ బాట పడుతున్నారు. కదిరి మున్సిపల్ పరిధిలోని ఓ స్విమ్మింగ్ పూల్‌కు చుట్టుపక్కల ప్రాంతాల వారు పెద్ద ఎత్తున వెళ్లి సేదదీరుతున్నారు. గంటల కొద్ది ఈత కొడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. – కదిరి టౌన్:

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పుట్టపర్తి టౌన్: పట్టణంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వస్తున్న ఆటో ఢీ కొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గోరంట్ల మండలం కరావులపల్లి తండాకు చెందిన లక్ష్మీపతి నాయక్ పనిమీద పుట్టపర్తికి బయలుదేరాడు. పుట్టపర్తి పట్టణంలో ఈశ్వరమ్మ పాఠశాల వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని నిదానం చేయడంతో వెనుక వస్తున్న ఆటో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన లక్ష్మీపతిని అనంతపురం తరలించారు.

అ'పూర్వ' కలయిక



తనకల్లులో గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



అమడగూరులో సమావేశమైన విద్యార్థులు



నిడిమామిడి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

తనకల్లు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1985–86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకే చోట కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమ ఉన్నతికి ఎంతగానో కృషి చేసిన ఉపాధ్యాయులను దుశ్శాలవాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జెడ్.రవీంద్రనాథ్, నగేష్, నిర్మల, విశ్వనాథ్‌రెడ్డి, గంగరాజు, శివప్ప, హరినాథ్‌రెడ్డి, అనిత, పర్వీన్, రమణమ్మ, డాక్టర్ ఫయాజ్, మహబూబ్ బాషా, ఖాదర్‌బాషా, షబ్బీర్, శ్రీనివాసులు, చలపతి, నారాయణస్వామి, నాగరాజు, జయనారాయణ రెడ్డి, సుబ్బలక్ష్మి, రెడ్డిశేఖర్‌రెడ్డి, చందు, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సాదిక్ వలి, శ్రీరాములు, కేశవరెడ్డి జమాల్ బాషా, కృష్ణానాయక్, శరత్ పోమార్‌ను సన్మానించారు. తుమ్మల గంగాధర్‌రెడ్డి, వీరఓబనపల్లి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: మండలంలోని నిడిమామిడి ఉన్నత పాఠశాలలో 2002–03 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులు రాజశేఖర్, మస్తాన్, బాలకృష్ణ, మల్లికార్జునరెడ్డి, నాగరాజు, వెంకటరమణ, నజీర్‌ను ఘనంగా సత్కరించారు.

సైనికుడి భార్యకు సన్మానం



సైనికుడు రామ్మోహన్ భార్యను సన్మానిస్తున్న దృశ్యం

తాడిమర్రి: ముదిగుబ్బ మండలం నక్కలపల్లికి చెందిన సైనికుడు సీమల రామ్మోహన్ దేశ సరిహద్దులో జరుగుతున్న ఇండియా–పాక్ యుద్ధానికి వెళ్లాడు. ఈ సందర్భంగా పుట్టినిల్లు అయిన తాడిమర్రి మండలం పెద్దకోట్లలో జరుగుతున్న చౌడేశ్వరీదేవి పుష్కర కుంభాభిషేకంలో పాల్గొన్న సైనికుని భార్య సీమల శ్రావణికి గ్రామానికి చెందిన సుజన, సౌజన్య, సుజాత, శ్రీలేఖ తదితర మహిళలు శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం నక్కలపల్లి నుంచి ఒక సైనికుడు వెళ్లడం గర్వంగా ఉందన్నారు. సైనికుని భార్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశానికి సేవ చేయాలని కోరారు.

ప్రతిభా పురస్కారాలకు పేరు నమోదు చేసుకోండి

నల్లమాడ: పది, ఇంటర్ మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వాల్మీకి విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు పేరు నమోదు చేసుకోవాలని వాల్మీకి ఉద్యోగ సంఘం పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఈరాతి నాగరాజు, కార్యవర్గ సభ్యులు బత్యాల వెంకటనారాయణ, పోతలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న పెనుకొండలోని మిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో పురస్కారాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదో తరగతిలో 450 మార్కులు, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులైతే 500 మార్కులు సాధించి ఉండాలన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 750, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో 850 మార్కులు సాధించి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈనెల 18లోగా తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. 9985522703, 8897171193 వాట్సాప్ నంబర్లకు పది, ఇంటర్ మార్కుల మెమోలను పంపాలన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు బ్యాంకులో జమ చేయాలి

నల్లమాడ: ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఇంతవరకూ పంచాయతీ బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదని సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. 2024–25 సంవత్సరానికి గాను రెండో విడతగా టైడ్, బేసిక్ కింద కేంద్ర రూ.1,121 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. ఇందులో 70 శాతం నిధులు పంచాయతీలకు విడుదల చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆ నిధులు ఇంతవరకూ బ్యాంకు ఖాతాలకు జమకాకపోవడంతో పంచాయతీల్లో పనులు చేయలేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే నిధులు జమ చేయాలని కోరారు.

వైద్య శిబిరానికి స్పందన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జయసింహ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 173 మందికి కంటి పరీక్షలు చేయగా 138 మంది శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారన్నారు. బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్సకు ఎంపికైనవారికి ఆపరేషన్లు చేస్తారన్నారు. పిన్ను సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన భార్య వసుంధర, కుమారులు సురేష్‌బాబు, సునీల్‌కుమార్ దాతృత్వంతో వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, కోశాధికారి సుదర్శనగుప్త, సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

మయూరాల సందడి



పెడపల్లిలో సంచరిస్తున్న మయూరాలు

పుట్టపర్తి అర్బన్: ఆహారం కోసం మయూరాలు (నెమళ్లు) గ్రామాల బాట పట్టాయి. పొలాల్లో పంటలు పూర్తిగా తొలగించడంతో ఊర్లలోకి వస్తున్నాయి. నెమళ్లకు స్థానికులు గింజలు వేసి ఆహారం అందిస్తున్నారు. ఆదివారం సాయంత్రం పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామంలోకి రెండు నెమళ్లు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.